


# జిందగీ చింతన

సాధించాలనే పట్టుదలే సంకల్పం.
సంకల్పం శుద్ధి కలిగినది అయితే...
దాన్ని నెరవేర్చడానికి దైవం తోడు
నిలుస్తుంది. దుస్సంకల్పమైతే..
తాత్కాలికంగా అది ఫలించినా,
అంతిమంగా పతనాన్ని ఇస్తుంది.
సంకల్పం వికల్పం కావొద్దంటే..
ఆధ్యాత్మిక శక్తి అవసరం. మనోబలానికి
దైవశక్తి తోడైతే అద్భుతాలు
సృష్టించవచ్చు. మనిషి మహనీయుడుగా
మారతాడు. అసాధ్యం అనేదే ఉండదు.

# సంకల్పం సదా బలం!



**మనసులో** కలిగే ఆలోచనలు అయితే సంతోషానికి, లేదంటే బాధకు కారణం అవుతుంటాయి. ఈ రెండూ కాని ఆలోచనంటూ ఏదీ ఉండదు. ఏ ఆలోచనైతే మనకు ఆనందాన్ని కలిగిస్తుందో.. దాన్ని సొంతం చేసుకోవాలనీ, ఆ ఫలితాన్ని అందుకోవాలనీ, అందుకోసం ఏదైనా సరే చేయాలనీ మనసు కోరుకుంటుంది. భౌతికంగా మన ప్రయత్నమూ ఆ దిశగానే సాగుతుంది. ఇలా మనలో పట్టుదలను కలిగించే ఆ ఆలోచనే సంకల్పం. అలాంటి సంకల్పానికి ఆధ్యాత్మికత మరింత చైతన్యాన్ని జోడిస్తుంది.

**మనం** అనుకునే ప్రతి మాటనూ, చేసిన ప్రతి ఆలోచననూ.. సంకల్పంగా భావించొద్దు. ఆలోచన వేరు, సంకల్పం వేరు! నిరంతరంగా ఆలోచించటం మనసు సహజ లక్షణం. ఒక్క క్షణంలో వందలాది ఆలోచనలు పుడుతుంటాయి. అవన్నీ సంకల్పాలు కావు. మనకు కలిగే ఆలోచనలన్నీ దాదాపు క్షణికాలే. వేలాది ఆలోచనల్లో ఏవో కొన్ని ఆలోచనలు మాత్రమే ఆచరణలోకి వస్తాయి. ఏ ఆలోచనైతే మళ్లీ మళ్లీ మన మనసులో మెదులుతుంటుందో, ఏ ఆలోచన గురించి మనసు, బుద్ధి తీవ్రంగా పరితపిస్తూ ఉంటాయో, ఏ ఆలోచన సాధించటం కోసం మన హృదయం అనుక్షణం పరితపిస్తుంటుందో ఆ ఆలోచనే 'సంకల్పం'గా భావించాలి.

### ఆది.. అనాది.. సంకల్పమే

మహాప్రళయం తర్వాత సృష్టిని తిరిగి ప్రారంభించాలని బ్రహ్మదేవుడు అనుకున్నాడు. ఆ సమయానికి ఆయన చేతిలో ఎలాంటి పరికరమూ లేదు. మనసు నిండా ఆలోచన మాత్రమే ఉంది. ఎలాగైనా సరే సృష్టి జరగాలని భావించాడు. ఆ ఆలోచన బలపడింది. సంకల్పంగా మారింది. 'తప', 'తప' అనే శబ్దం ఆకాశవాణి నుంచి వినిపించింది. తపస్సు ప్రారంభించాడు. విరాట్పురుషుడికి అనుగ్రహం లభించింది. బ్రహ్మ ముఖం నుంచి రుద్రుడు ఆవిర్భవించాడు. అక్కడ నుంచి మిగిలిన సృష్టి అంతా ఆవిర్భవించింది. బ్రహ్మ సంకల్పానికి సైతం ఆధ్యాత్మిక శక్తి అవసరమైంది. తపస్సు, సాధన ద్వారానే ఇది సాధ్యపడింది.



### సంకల్పం.. సాధన

మహారాజు విశ్వామిత్రుడు చాలా గర్విష్ఠి. బ్రహ్మర్షి అయిన వశిష్ఠుడిని అనేకరకాలుగా ఇబ్బందిపెట్టడానికి ప్రయత్నిస్తాడు. కానీ, ఏ ప్రయత్నమూ ఫలించదు. వశిష్ఠుడికి ఉన్న బ్రహ్మర్షిత్వం తనకూ కావాలనుకుంటాడు విశ్వామిత్రుడు. తపస్సు ప్రారంభిస్తాడు. కొద్దికాలానికే మేనక మోహంలో పడి తపస్సు విడిచిపెడతాడు. అప్పటిదాకా పొందిన శక్తి వ్యర్థమైపోతుంది. తప్పు తెలుసుకొని ఈసారి గట్టిగా సంకల్పించుకున్నాడు. తపస్సు ప్రారంభించాడు. దైవమూ అనుగ్రహించింది. అమోఘమైన తన ఆధ్యాత్మిక సంకల్పశక్తితో విజయం సాధించాడు. వశిష్ఠుడితో 'బ్రహ్మర్షీ!' అని పిలిపించుకున్నాడు. సంకల్పన సాధనకు విశ్వామిత్రుడి కథ ప్రేరణగా నిలుస్తుంది.

### సంకల్పానికి ధ్రువస్థానం

సవతి తల్లి సురుచి పలికిన నిష్ఠురాలకు ధ్రువుడు ఎంతగానో కుమిలిపోయాడు. కన్నతండ్రిని కనీసంగా కూడా చేరలేని తన స్థితికి దుఃఖించాడు. ఎలాగైనా సరే తండ్రి ఉత్తానపాదుడి ప్రేమను పొందాలని సంకల్పించాడు. తల్లి సునీతి సూచనతో తపస్సు కోసం అడవులకు చేరుకున్నాడు. నారద మహర్షి చేసిన మంత్రోపదేశంతో శ్రీమన్నారాయణుడి ప్రత్యక్ష దర్శనం పొందాడు. దీంతోపాటు శాశ్వతమైన ధ్రువస్థానాన్ని సాధించాడు. ఆధ్యాత్మిక శక్తి తోడైన ధ్రువుడి సంకల్పం ఆచంద్రతారార్కం నిలిచిపోయింది. సత్సంకల్పం సాధించిన సర్వోన్నత విజయానికి ఇది సంకేతం.

### సంకల్పశక్తి

ప్రతి మనిషిలో ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అనే మూడు శక్తులు సహజంగా ఉంటాయి. ఇవి పుట్టుకతోనే వస్తాయి. అయితే, ఈ శక్తులు తనలో ఉన్నాయన్న ఎరుక కొద్దిమందికి మాత్రమే ఉంటుంది. ఈ మూడుశక్తుల్లో మొదటిదైన ఇచ్ఛాశక్తే సంకల్పశక్తి. మనలోని ఈ అద్భుతమైన శక్తి దైవికమైనది. మన ద్వారా జరిగే ప్రతి పనికీ మనలో కలిగే సంకల్పమే కారణమవుతుంది. సత్సంకల్పం మనలో పుట్టాలంటే జ్ఞానం ఉన్నంత మాత్రాన సరిపోదు. దైవ సాయమో, ప్రకృతి ప్రేరణో దోహదం చేసినప్పుడు సంకల్పానికి శక్తి ఒనగూడుతుంది.




**సంకల్పానికి,** ఇచ్ఛాశక్తికి కొద్దిపాటి తేడా ఉంటుంది. ఈ సూక్ష్మభేదాన్ని మనం గ్రహించాలి. సంకల్పం అంటే దృఢ నిశ్చయం. ఏదైనా ఒక పని జరిగితీరాల్సిందే అని మనం అనుకుంటే అది కేవలం 'ఇచ్ఛ' (కోరిక)గానే మిగిలిపోతుంది. ఈ ఇచ్ఛ వెనక దృఢమైన నిశ్చయం ఉంటే అది సంకల్పంగా మారుతుంది. సంకల్పాల ద్వారా మనం శక్తిని పొందటమో, పోగొట్టుకోవడమో జరుగుతుంది. పవిత్రమైన సంకల్పాలతో శక్తి ఉత్పన్నమవుతుంది. అపవిత్రమైన సంకల్పాలతో శక్తి నాశనమవుతుంది. మన ఆధ్యాత్మిక వ్యక్తిత్వాన్ని వ్యక్తపరిచేవే పవిత్ర ఆలోచనలు. మిగతావన్నీ పతనానికి దారితీసేవే. సత్సంకల్పానికి దైవబలం రక్షణగా నిలుస్తుంది. దుస్సంకల్పాలను దైవమే హరిస్తుంది. సంకల్పం సదా బలంగా ఉండాలంటే... అది మంచిదై ఉండాలి. పదిమంది మంచికీ ఉపయోగపడాలని గుర్తుంచుకోవాలి.

... డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

## గొప్ప భాష

కథాసుధ

**ఒక** యువకుడికి జీవిత పరమార్థం తెలుసుకోవాలని అనిపించింది. అందుకోసం పుస్తకాలు చదవాలనుకున్నాడు. అయితే, 'ఏ భాష నేర్చుకుంటే ఎక్కువ విషయాలు తెలుసుకోగలం' అనే ఆలోచనలో పడ్డాడు. దగ్గర్లోని ఆశ్రమానికి వెళ్లి సందేహనివృత్తి చేసుకోవాలనుకున్నాడు. అప్పుడు ఆశ్రమంలో ఓ సత్సంగం జరగనుంది. అక్కడికి దేశవిదేశీయులు, పండితపామరులు వచ్చారు. దానికి హాజరైన ఒక పండితుడిని ఆ యువకుడు 'ఏది గొప్పభాష, ఏ భాషను నేర్చుకోమంటారు?' అని అడిగాడు. అనేక భాషలకు సంస్కృతం మూలం. పరమేశ్వరుని డమరుక నాదం నుంచి ఆ భాష వెలువడిన శుద్ధ బ్రహ్మమే సంస్కృత భాష అంటారు. ఆ భాష నేర్చుకుంటే శ్రేష్ఠమని ఆ పండితుడు సలహా ఇచ్చాడు. అక్కడే ఉన్న ఉత్తర భారతీయుడు హిందీ నేర్చుకోమని సూచించాడు. విదేశీయుడు ఆంగ్లం నేర్చుకోమన్నాడు. ఇలా ఒక్కొక్కరూ ఒక్కో భాష నేర్చుకోమని చెప్పుకొచ్చారు. ఆశ్రమంలోని గురువు ఇదంతా గమనించి యువకుడిని దగ్గరికి రమ్మన్నాడు. జీవిత పరమార్థం తెలుసుకోవాలంటే నువ్వు మౌనభాష నేర్చుకోవాలని చెప్పాడు. మనలోకి మనం ప్రయాణించే అవకాశం మౌనంలో మాత్రమే దొరుకుతుంది. అది ఖర్చుతో కూడిన వ్యవహారం కాదు. దానికి ప్రత్యేక ఏర్పాట్లు కూడా అవసరం లేదు. ఎవరి సాయమూ తీసుకోవాల్సిన పని లేదు. మనకు మనమే చేయగలిగినది. మౌనం వహించి మనల్ని మనం గమనిస్తే చాలు. ఆ మౌనం మనకెంతో నేర్పగలదు. ఈ ప్రకృతితో అనుసంధానం చేయగలదు. మౌనంలో ఉండి మనలోకి మనం తొంగి చూడాలి. అప్పుడు మనకు జీవితం పట్ల అవగాహన కలుగుతుంది. మనమే ప్రపంచం, మనలోనే ప్రపంచం ఉందని అర్థమవుతుందని వివరించాడు. మౌనాన్ని మించిన గొప్ప భాష లేదని తెలుసుకొని అక్కడినుంచి కదిలాడు యువకుడు.



... ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
93936 62821

## అన్నీ పరమాత్మకే!

గీతావాక్యం

'యేఽప్యన్య దేవతా భక్తా యజంతే శ్రద్ధయాన్వితాః।
తేఽపి మామేవ కౌంతేయ యజంత్య విధిపూర్వకమ్॥

(భగవద్గీత 9-23)

'ఓ అర్జునా! శ్రద్ధాన్వితులైన సకామ భక్తులు ఇతర దేవతలను పూజించినప్పటికీ, వారు నన్ను పూజించినట్లే' అంటాడు శ్రీకృష్ణ పరమాత్మ. దేవుడు ఒక్కడే అన్న భావనను తెలియజేస్తుంది ఈ శ్లోకం. అంతటా వ్యాపించి ఉన్న భగవంతుడు ఒక్కడే అయినా, దేశకాల పరిస్థితులు, నమ్మకాలు, వ్యక్తిగత ఇష్టాలను బట్టి వేర్వేరు రూపాలతో కొలుస్తుంటారు. సాధారణ మనుషుల రూపాలు, పేర్లతోపాటు వారి అభిరుచులు, అలవాట్లు వేర్వేరుగా ఉంటాయి. అలాగే దైవాన్ని వివిధ రూపాలుగా కొలిచి, వివిధ నామాలతో, రకరకాల పద్ధతులలో ఉపాసిస్తూ ఉంటారు. కొందరు శక్తిగా భావిస్తారు. మరికొందరు రాముడిగా కీర్తిస్తారు. ఇంకొందరు శివుడిగా భావించి స్తుతిస్తారు. ఎవరు ఎలా ఆరాధించినా, ఏవిధంగా ఉపాసించినా దైవం కరుణిస్తాడు. భక్తుడు ఏ రూపంలో పూజిస్తే.. అదే రూపంలో అనుగ్రహిస్తాడు భగవానుడు. ఆ పేరుతోనే పలుకుతాడు దేవదేవుడు. ఏ దేవుడి కోసం చేసిన ఆరాధనలైనా అవన్నీ అనంతమైన పరమాత్ముడికే చెందుతాయని తెలుసుకోవాలి.

... శ్రీ

## ఆరో నమాజు


ఇస్లాం బోధ

**ముస్లింలు** రోజుకు ఐదు పూటల నమాజు విధిగా చేయాలి. ఖురాన్‌లో అల్లాహ్ చెప్పిన మాట ఇది. అయితే అల్లాహ్ సాన్నిహిత్యాన్ని కోరుకునేవారు మాత్రం రోజుకు ఆరు పూటలు నమాజు చేస్తారు. ఉదయం వేళ ఫజర్, మధ్యాహ్నం అసర్, సాయంత్రం అసర్, మగ్రిబ్, రాత్రి ఇషా నమాజులు ప్రతీ ముస్లిం విధిగా చేయాల్సిన నమాజులు. అయితే అర్ధరాత్రి దాటాక, మూడోజామున చేసే నమాజు తహజ్జుద్. దీనిని ముహమ్మద్ ప్రవక్త (స) రోజూ విధిగా నెరవేర్చేవారు. ప్రపంచమంతా నిద్రలో ఉండగా మూడోజామున లేచి ఏకాంతంలో చేసే తహజ్జుద్ నమాజు ఎంతో పుణ్యప్రదమని ప్రవక్త (స) చెప్పారు. ఆ ఘడియలో చేతులెత్తి చేసే విన్నపాలు అల్లాహ్ స్వీకృతి పొందుతాయని చెబుతారాయన. ఈ నమాజును ఆచరించే దాసులంటే అల్లాహ్‌కు ఎంతో ప్రీతి. మూడో రేయిన అల్లాహ్ చివరి ఆకాశం మీదికి వచ్చి 'నన్ను అడిగేవారెవరైనా ఉన్నారా? అలాంటి వారి విన్నపాలను నేను స్వీకరిస్తాను' అని ప్రకటిస్తాడని ప్రవక్త (స) పేర్కొన్నారు. గాఢనిద్రను త్యజించి నమాజు చేసేవారికి అల్లాహ్ కష్టాలనుంచి గట్టెక్కిస్తాడు. ఆ వేళలో దైవం ముందు నిలబడి చేసే నమాజులో గొప్ప అనుభూతి లభిస్తుంది. మనలో నిబద్ధత అలవడుతుంది. ఆ ఘడియల్లో అల్లాహ్ కారుణ్యం కురుస్తుంది. హృదయం దివ్యకాంతితో ప్రకాశిస్తుంది. ముఖంపై తేజస్సు ఉట్టిపడుతుంది. ప్రశాంతత ఆవరిస్తుంది. పనుల్లో శుభాలు వర్షిస్తాయి. దైవభక్తి పరాయణులు... రాత్రివేళలో చాలా తక్కువ నిదురపోతారని, రాత్రి చివరి ఘడియలలో తమ తప్పులకు పశ్చాత్తాపం చెందుతారని ఖురాన్ పేర్కొంటున్నది. 'రాత్రిపూట ఆరాధన నిమిత్తం నిద్రలేచే పురుషుణ్ని దేవుడు కరుణించుగాక, అతను లేచి నమాజ్ చేస్తాడు. తన భార్యను కూడా (నమాజ్ కోసం) మేల్కొలుపుతాడు. ఒకవేళ ఆమె లేవకపోతే ముఖం మీద నీళ్లుచల్లి లేపటానికి ప్రయత్నిస్తాడు. అలాగే రాత్రిపూట ఆరాధన నిమిత్తం నిద్రలేచే స్త్రీని దేవుడు కరుణించుగాక, ఆమె లేచి నమాజ్ చేస్తుంది. తన భర్తను కూడా (నమాజ్ కోసం) నిద్రలేపుతుంది. ఒకవేళ అతను లేవకపోతే ముఖం మీద నీళ్లు చల్లి మరీ లేపటానికి ప్రయత్నిస్తుంది' అని చెప్పారు ప్రవక్త.



... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

# మమ మాయా దురత్యయా!




**పరమర్షి** శుకయోగి పరీక్షిత్తుతో.. వసుమతీశా (రాజా)! కసిపూనిన కంసుడు దేవకిని ఒడిసిపట్టి అసి-కత్తి దూసి తెంపు-సాహసం చేసి చంపబోగా చూసి, ఎలాగైనా ఒప్పించి తప్పించాలని వసుదేవుడు మనసులో ఇలా తలపోశాడు...

కం॥ 'ఎందును గాలము నిజమని
పందతనం బునను బుద్ధిఁ బాయక ఘనులై
యెందాఁక బుద్ధి నెగడెడి
నందాఁకఁ జరింప వలయు నాత్మ బలమునన్'


'పుట్టిన వానికి ఎట్టకేలకు గిట్టుట తప్పదు కదా!' అనుకొంటూ పిరికితనంతో నిట్టూరుస్తూ ఉండరాదు. మానవులకు బేలతనం పనికిరాదు. ఎప్పటికైనా కాలమే బలవంతమన్నమాట ఉన్నప్పటికీ, దిట్ట తనం- ధైర్యంతో బుద్ధిబలం కొలది, అపాయం తొలగే ఉపాయం ఆలోచించాలి అని నిశ్చయించాడు. వసుదేవుడు.. బావా! దేవకిని చంపితే నీకు దివ్యత్వం- అమరత్వం అబ్బుతుందా? అసలు నీ చావుకు కారణం ఆమె సంతానమే కాని ఆమె కాదు కదా! కంసుడు.. అవును, ఐతే ఏమిటంట? వసుదేవుడు.. ఈమె అపత్యం- సంతానాన్ని చంపడానికి తప్పక నీకే అప్పగిస్తా. 'ఈ ఒప్పందం చాలా ఒప్పిదం- అందంగా ఉంది. ఇలా అయితే స్త్రీ హత్యా పాపపు ముప్పు నుంచి కూడా తప్పుకుంటా' అని తలచి కంసుడు చప్పున చెల్లెలి కొప్పు విడిచి వెళ్లిపోయాడు. 'బతుకు జీవుడా' అనుకొంటూ వసుదేవుడు సుందరి- భార్యతో మందిరానికి చేరి ఇందిరావరుని స్మరిస్తూ ఆనందంగా ఉన్నాడు. అంత కొంత కాలానికి ఆ ఇంతి దేవకి, కంసుడు నిరంతరం పెట్టే వంతలు- కష్టాలు సహిస్తూ సంతసంతో సమస్త దేవతల భావాన్ని పొంది ఏడాదికి ఒకరు చొప్పున ఎనమండుగురు కొడుకులను, ఏకైక కుమార్తె- సుభద్రను కన్నది. 'బతకని బిడ్డ బారెడు' అన్న చందాన దేవకి కన్న ప్రథమ పుత్రుని పేరు 'కీర్తిమంతుడు'. 'అపత్య- పుత్ర రక్షణ కన్నా సత్యరక్షణే మిన్న' అని అనుకొన్న ఆనక దుందుభి (భగవంతునికి తండ్రి కాబోతున్నాడని ఈ భాగ్యవంతుని జన్మకాలంలో భేరీ మృదంగాలు మోగినందున అతనికి ఈ నామం)- వసుదేవుడు, తాను అన్నమాట ప్రకారం దేవకి మున్నుగా కన్న బిడ్డను ఖిన్నుడవక- కలత చెందక కంసునికి విన్నవించాడు. శుక ఉవాచ...

ఆ॥ 'మానవేంద్ర! సత్యమతికి దుష్కరమెయ్య
దెరుక గలుగువాని కిష్టమెయ్య
దీశభక్తిరతుని కీరాని దెయ్యది
యెరుక లేనివానికేది కీడు'

'రాజా! సత్యవంతునికి కష్టమనేది ఉంటుందా? జ్ఞానికి ఇష్టమనేది, ఈశ్వర భక్తునికి ఇవ్వరానిది, అజ్ఞానికి 'మంచి- చెడు' అను విజ్ఞానమూ ఉంటుందా? తన మొదటి మగబిడ్డను ఏమాత్రం వగవక- దుఃఖించక పగవానికి చంపగ సమర్పించిన వాడు- 'ఇల వసుదేవుండు తక్క నితరుడు కలడే?- సత్యమతి అయిన వసుదేవుడు తప్ప వసుమతి- జగతిలో ఇట్టి సుమతి ఇతరుడున్నాడా? వసుదేవుని సమబుద్ధికి, సత్యనిష్ఠకు కంసుని కరకు మనసు కూడా కరిగింది. వాడన్నాడు... 'బావా! ఈ పసివానిని, కసుగందు- లేతబిడ్డను నీవే తీసుకొనిపో. వీనివలన నాకు వెరపు- భయం లేదుగా! నా పాలిటి కాలుడు- యముడైన నీ ఆలి ఎనిమిదవ చూలిని మాత్రం మీరెంత బతిమాలినా జాలి చూపక వెంటనే వధిస్తా. వసుదేవా! అంతవరకు నిన్నిక ఎంతమాత్రం విసిగించను.' కంసుడు ఇలా పలకగానే వసుదేవుడు తన నందనుని- బిడ్డను వెనకకు తెచ్చుకున్నా, అనుమానంగానే కాని ఆనందంగా మాత్రం లేడు. వాని అలుక- ద్రోహ చింతన తలచి 'ఎప్పుడేమో' అని లోలోపల ఉలికిపడుతూనే ఉన్నాడు.


ఇలా ఉండగా ఒకనాడు నారద మహర్షి కంసుని వద్దకు పనికట్టుకొని వచ్చి ఏకాంతంగా అతని చెవిలో ఇలా ఊదాడు... 'కంసా! మంద- వ్రేపల్లెలోని నందాదులు, మథురలోని వసుదేవాది యాదవులు, వారి భార్యలు అందరూ సురులు- దేవతలే కాని నరులు కారు. నీవు కూడా గత జన్మలో కాలకాలుడైన నారాయణుని చేతిలో విగత జీవుడవైన 'కాలనేమి' దానవుడవు. దేవదేవుడు శ్రీహరి, శిష్టయగు దేవకీ మాత అష్టమ గర్భంలో అవతరించి భూతలాన్ని అతలాకుతలంగావించే నీవంటి దుష్టులందరినీ సంహరిస్తాడు. జాగ్రత్తపడు'. 'దేవకి అష్టమ గర్భం కదా నాకు అరిష్టం. ఇప్పటి నుంచే ఈ రొష్టు ఎందుకు దేవర్షీ' అన్నాడు కంసుడు. నారదుడు- 'అమాయకుడా! దేవమాయనా నీవు నమ్మేది? రెండవ దాని నుంచి లెక్కవేస్తే మొదటిది ఎనిమిదవది అవదా? కంసా! మాయ అనిర్వచనీయం. అది 'అఘటన ఘటనా పటీయసి'- అసంభవాన్ని సుసంభవం చేయగలది. ఇందులో ఒకటి ఎమిదవుతుంది. ఎనిమిది ఒకటవుతుంది. ఆలోచించుకో' అని హెచ్చరించి దేవలోకానికి వెళ్లిపోయాడు. ఈ లెక్కవిని కంసుడు అవాక్కయ్యాడు. పెచ్చరిల్లిన కచ్చతో తిన్నగా వెళ్లి దేవకీ వసుదేవులను ఉన్నపళంగా చెరసాలలో బంధించాడు. వారి ఆరుగురు కుమారులను మారజనకుని- విష్ణుని రూపాలుగా భావించి ఒకేమారు క్రూరంగా వధించాడు. నిగ్రహం కోల్పోయి ఆగ్రహించి తండ్రి ఉగ్రసేనుని కూడా కారాగృహంలో నిర్బంధించి తనను తాను ప్రభువుగా ప్రకటించుకొన్నాడు. దేవకికి పుట్టిన ఆరుగురు పుత్రులూ గతంలో మరీచి సంతానం. పుట్టగానే గిట్టునట్టి శాపం మూటగట్టుకొని పుట్టినవారు. ఈ గుట్టు తెలిసిన నారదుడు కంసుని పాపం త్వరగా పొందడానికి వానిలోని కోపాన్ని- హింసను తట్టిలేపాడు. జీవుల పాపపుణ్యాలతో దేవునికి ప్రమేయం ఉండదు. ఈశ్వరుడు తారకుడు- తరింపజేసే ఉద్ధారకుడే కాని, మారకుడు కాదు. పరమాత్మ ఎవరినీ చంపడు. మనిషి పాపమే అతనికి మారకం. కాన, నిరంతరం పాపానికి భయపడాలి.

శుక ఉవాచ- రాజా! ఇలా రాజ్యం కైవసం చేసుకొన్న కంసుడు బాణ, నరక, జరాసంధ, ధేనుక, కేశి, ప్రలంబ, తృణావర్త, చాణూర, ముష్టిక, అరిష్ట, అఘ, బక, పూతనాది జగత్ జెట్టీలైన అసురులను జయించి తన అనుచరులుగా కూడగట్టుకున్నాడు. అంతఃకరణంలోని కామ, క్రోధాది అశుభ వాసనలే అసుర విసరం- సమూహం! ఇది పరమార్థం! అనంతరం ఆదిశేషుడనబడే అంశతో విశ్వగర్భుడు- విష్ణుమూర్తి తేజస్సు దేవకీదేవి గర్భాన ఏడవ అర్భకుని- శిశువుగా నిలిచింది. అప్పుడు మాయాపతి- మాధవుడు యోగమాయను పిలిచి ఇలా ఆదేశించాడు... 'దేవీ! దేవకి కడుపులో ఉన్న శేషుడనే నా తేజస్సును సంకర్షించి- బయటికి తీసి ఒడుపుగా గోకులంలో తలదాచుకొంటున్న ఉత్తమురాలైన వసుదేవుని భార్య రోహిణి గర్భంలో ప్రవేశపెట్టు. తదుపరి నేను నా పూర్ణాంశతో దేవకికి అష్టమగర్భంగా అవతరిస్తా. కల్యాణీ! నీవు కూడా గోకులంలో నందరాణి యశోదకు బిడ్డవై పుట్టు'.



యోగమాయను ఆశ్రయించక పరబ్రహ్మ అవతారం గ్రహించలేడు. శబల బ్రహ్మకు- మాయతో కూడిన భగవంతునకు తప్ప శుద్ధబ్రహ్మకు అవతారం లేదు. చొక్కపు- శుద్ధమైన అపరంజి- బంగారులో రాగి కలవనిదే సింగారానికి, మక్కువ గల చక్కని ఆభరణం ఏర్పడదు కదా! యోగమాయ పరబ్రహ్మ చెప్పుచేతలలో మెలిగే శక్తి. స్వామి అప్పజెప్పిన పని చకచక చేసేసింది. తెల్లవారే సరికల్లా మథురాపుర ప్రజలెల్లరూ దేవకికి గర్భస్రావం జరిగిందని గొల్లుమంటూ గగ్గోలుపెట్టారు. పిమ్మట రోహిణికి కుమారుడు కలిగాడు. భాద్రపద శుద్ధ ఏకాదశిన బలరామావతారం. బలరాముడు వేదశాస్త్రాది రూపమైన శబ్దబ్రహ్మ స్వరూపం. అవని పైకి కాని, అంతఃకరణంలోకి కాని శబ్దబ్రహ్మ రాక తరవాతే పరబ్రహ్మ- కృష్ణుని ఆగమనం! పరిపూర్ణంగా కలిగిన పరోక్ష జ్ఞానం అపరోక్షమవుతేనే పరబ్రహ్మ అనుభవం. స్వానుభవం లేని కేవల వాచా (బుకిష్) జ్ఞానం అజ్ఞానంతో సమానం. కాంతుని- భర్తను ఎడబాసి నందుని ఇంట ఏకాంతంగా ఉంటున్న వసుదేవ పత్ని రోహిణి ఎలా అంతర్వత్ని- గర్భవతి కాగలిగిందన్న వింతను గురించి లోకానికి ఆవంత కూడా శంక కలగక పోవడం పంకజాక్షుని కింకరి, సర్వజీవ వశంకరి అయిన మాయాదేవి ప్రభావం!

(సశేషం)



తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006